సాక్షి
నంద్యాల
ఆదివారం । 6 । ఆగస్టు । 2023



నిలిచిపోయిన ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. డ్యాంలో 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉంది. తాగునీటి కోసం కేసీ కెనాల్‌కు 130 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు.



స్నేహ బంధం.. సేవా సుగంధం

కొందరు మిత్రులు బృందాలుగా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆపన్నులకు, అన్నార్తులకు సాయం చేస్తున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. 10లో



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,627.49
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 85.010
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 10,724
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 5,484

న్యూస్‌రీల్

శ్రీశైలంలో వారాంతపు రద్దీ



భక్తులతో నిండిన క్యూ కంపార్ట్‌మెంట్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వారాంతపు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం భక్తులు తరలి వచ్చారు. వేకువజాము నుంచే భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆలయ క్యూల వద్ద బారులుదీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టారు. క్యూలలో వేచి ఉండు భక్తులకు అల్పాహారం, తాగునీరు, బిస్కెట్లు, అందించారు.

పింఛన్ల పంపిణీ 99.21శాతం పూర్తి



పుసులూరులో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో వైఎస్సార్ ఆసరా కానుక పింఛన్ల పంపిణీ ఐదో రోజు శనివారం 99.21 శాతం పూర్తయింది. ఈనెల 1న పింఛన్ల పంపిణీ ప్రారంభం కాగా.. గ్రామ, వార్డు వలంటీర్లు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. శనివారం నంద్యాల మండలం పుసులూరు గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో 2,13,642 పెన్షన్లు ఉండగా 2,11,954 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు.

రేపు డోన్‌లో జాబ్ మేళా

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 7వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు ప్రముఖ కంపెనీలు అయిన హోండా మొబైల్స్ బెంగళూరు, ఎల్ అండ్ టీ జడ్చెర్ల, విప్రో కంపెనీ హిందూపురంతో పాటు జిల్లాలోని ఇతర ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జూలై 23న నిర్వహించిన పరీక్షకు హాజరైన వారు, ఐటీఐ పాసైన అభ్యర్థులు హాజరు కావచ్చని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం పది గంటలకు చేరుకోవాలన్నారు.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): ఎమ్మిగనూరు సమీపంలోని బనవాసి నవోదయ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో చేరేందుకు ఈనెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయ సమితి నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఈ విద్యా సంవత్సరం 2023–24లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల చేత మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి ఎలాంటి రుసుం లేకుండా www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు కర్నూలు జిల్లాలో 9 మండలాలు, నంద్యాల జిల్లాలో 18 మండలాల్లో వర్షం కురిసింది. నంద్యాల జిల్లాలోని దొర్నిపాడులో 10.2 మి.మీ, కర్నూలు జిల్లా పరిధిలోని కర్నూలు రూరల్‌లో 4.8 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదైంది.

ఓటుపాట్లు లేకుండా..

- చురుగ్గా ఓటరు జాబితా సవరణ
- ఇంటింటా తిరిగి పరిశీలన చేస్తున్న బీఎల్‌ఓలు
- 21వ తేదీ వరకు కొనసాగనున్న సర్వే



మహానందిలో ఇంటింటి సర్వే చేస్తున్న బీఎల్‌ఓలు

నంద్యాల(అర్బన్): మీ ఓటు ఎక్కడ ఉంది? మీరు ఉంటున్న డోర్ నంబర్‌లోనే ఓటు ఉందా? ఓటు మార్చాలనుకుంటున్నారా? ఒకే ఇంటిలో పదుల సంఖ్యలో ఓట్లు ఉన్నాయా? అలా ఉంటే ఏం చేయాలి? 18 ఏళ్లు నిండినా ఓటరుగా నమోదు కాలేదా.. ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపేందుకు.. తప్పొప్పులను సరిదిద్దేందుకు సంక్షిప్త జాబితా సవరణలో అధికారులు నిమగ్నమయ్యారు. ఓటరు సంక్షిప్త సవరణ–2024 కార్యక్రమం నంద్యాల జిల్లాలో చురుగ్గా సాగుతోంది. బీఎల్‌ఓలు ఇంటింటా తిరిగి ఓటరు జాబితాను పరిశీలిస్తున్నారు. 2023 – జనవరి వరకు జిల్లాలోని 1,604 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 13,51,120 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 6,67,127, మహిళలు 6,83,709, ఇతరులు 284 మంది ఓటర్లు ఉన్నారు. పాత ఓటరు జాబితాలో తప్పొప్పుల సవరణతోపాటు కొత్త ఓటర్ల చేరిక కోసం జూలై 21వ తేదీ ప్రారంభమైన ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024 కార్యక్రమం జిల్లాలో ఊపందుకుంది. కొత్తగా ఓటరు నమోదు, చనిపోయిన వారిని తొలగించడం, మార్పులు, చేర్పులు, తప్పొప్పుల సవరణ తదితర పనుల కోసం ఓటర్ల నుంచి బీఎల్‌ఓలు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ ప్రక్రియ ఈనెల 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. జిల్లాలో 4,53,270 నివాస గృహాలు ఉండగా ఇప్పటి వరకు బీఎల్‌ఓలు దాదాపు 70 వేల ఇళ్లలో ఓటరు పరిశీలన పూర్తి చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో కొత్తగా ఓటరు నమోదు కోసం ఫారం–6 కింద, మార్పులు, చేర్పుల కోసం, డిలిషన్ కోసం మొత్తం 1500 దరఖాస్తులు వచ్చాయి.

అవసరమైతే బూత్‌ల విభజన...

ఒక బూత్‌లో 1,500 నుంచి 2,000 లేదా అంత కంటే ఎక్కువ ఓట్లు కూడా ఉంటున్నాయి. అటువంటిది ఇక ముందు ఒక బూత్‌లో 1,500 ఓట్లకు మించకుండా బూత్‌లను నిర్ధారించనున్నారు. 1500 ఓట్లకు మించి ఉంటే కొత్త బూత్‌కు సిఫార్సు చేయనున్నారు. ప్రధానంగా పేర్లు తప్పులు ఉండటం, నియోజకవర్గాలు, అడ్రస్‌లు, ఫోన్ నెంబర్లు, ఫొటో గుర్తింపు కార్డులు మార్పులు, చేర్పులు ఇలా అన్నింటా తప్పుఒప్పులు సరి చేయనున్నారు.

వలస వెళ్లిన వారికి అవకాశం

ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు సహజంగా ఎన్నికలప్పుడు స్వస్థలానికి వస్తుంటారు. వీరి ఓటును వెళ్లిన ప్రాంతంలో ఉంచాలా లేక, స్వస్థలం జాబితాలో ఉంచాలా అనేది వారి ఆ ఓటరు అభీష్టానికి అనుగుణంగా బీఎల్‌ఓలు నిర్ణయిస్తారు. ప్రస్తుతం తాము ఉంటున్న ప్రాంతంలోనే ఓటు కావాలనుకుంటే ఫారం–8లో పొందుపరిచిన ధ్రువీకరణల్లో ఏ ఒక్కటి చూపించినా సరిపోతుంది.

అక్టోబర్ 17న ముసాయిదా జాబితా ప్రకటన

ప్రత్యేక ఓటరు నమోదు సవరణ 2024లో భాగంగా అక్టోబర్ 17వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తారు. ఆ జాబితాపై అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. డిసెంబర్ 26వ తేదీ నాటికి అభ్యంతరాల పరిశీలనను పూర్తి చేసి 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు. అక్టోబర్ 28, 29, నవంబర్ 18,19 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ కార్యక్రమాలు నిర్వహించి ఓటర్ల నుంచి అభ్యంతరాలు, మార్పులు, చేర్పులపై ఫిర్యాదుల, సలహాలు, సూచనలను స్వీకరిస్తారు. ఆయా రోజుల్లో జిల్లాలోని 1,604 పోలింగ్ బూతుల్లో అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారు.

యువ ఓటర్లకు అవకాశం



ప్రతి ఓటును సరిచూసుకోవాల్సి ఉంది. డబుల్ ఎంట్రీ ఉంటే తొలగించి ఓటరు ఇష్టం మేరకు ఒకచోట జాబితాలోనే ఉంచుతాం. ఓటరు ఫొటోలు తప్పులు, పేర్లు, చిరునామా తప్పులు ఉంటే వాటిని సరిదిద్ది సమగ్రమైన ఓటర్ల జాబితా రూపొందించనున్నాం. వలస వెళ్లిన వారి ఓట్లు విషయంలో వారు ఇచ్చే ఎంపిక చేసుకునే ప్రాంతంలోనే ఓటు ఉంచుతారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండేలా రాజకీయ పార్టీలు అవగాహన కల్పించాలి.

– పుల్లయ్య, డీఆర్‌ఓ పుల్లయ్య, నంద్యాల

సర్వే ఇలా..



సమగ్ర ఓటరు సర్వే ప్రత్యేక డ్రైవ్ కోసం జిల్లా అధికారులు విస్తృతమైన ఏర్పాట్లు చేశారు.

- ఇంటింటికీ బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓ) చేరుకుని తప్పొప్పులు సరిదిద్దడంతో పాటు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించనున్నారు.
- 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు వయస్సు నిండిన వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు చూపిస్తే ఓటరుగా నమోదు కావచ్చు.
- జాబితాలో రెండు చోట్ల ఓట్లు, నకిలీ ఓట్ల గుర్తింపు, మృతి చెందిన వారి ఓట్ల తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.
- వందేళ్లు పైబడిన వారిని గుర్తించే పని కూడా నిశితంగా చేపడుతున్నారు.
- డోర్ నంబర్లు లేకుండా ఉన్నా, ఒకే డోర్ నంబరుపై పదుల సంఖ్యలో ఓట్లు ఉన్నా వాస్తవికతను లోతుగా తెలుసుకుంటారు. లోపాలు ఉంటే సరిదిద్దనున్నారు.
- సర్వీసు ఓటర్లు (మిలటరీ), ఎన్‌ఆర్‌ఐ (ప్రవాస భారతీయులు) ఓటర్ల వివరాలను సరిచేయనున్నారు.
- ఓటరు గుర్తింపు కార్డులో పేరు ఒకటి, ఫొటో మరొకటి ఉంటుంది. కొన్ని కార్డుల్లో ఫొటోలు గుర్తు పట్టడానికి కూడా వీలుకాకుండా ఉంటాయి. అలాంటప్పుడు కొత్త ఫొటోలతో కార్డులను సరిదిద్దనున్నారు.

ఆన్‌లైన్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవడం ఎలా?

ఓటును వజ్రాయుధం లాంటిది. మంచి పాలకుడికి ఎన్నుకోవడానికి రాజ్యాంగం ప్రతి పౌరుడికీ ఇచ్చిన హక్కు ఇది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవడం బాధ్యతగా భావించాలి. అలాగే ఓటు ఉన్న వారు జాబితాలో తమ పేరు ఉందో లేదో చేసుకోవాలి. ఓటు నమోదు కోసం, మార్పుల చేర్పుల కోసం WWW.VOTERPORTAL.CEO లేదా VOTER HELP LINE యాప్‌ను సంప్రదించాలి. ఇందులో ఫారం–6, ఫారం–6ఏ, ఫారం–7, ఫారం–8, ఫారం–8ఏ ఉంటాయి. అందులో ఏ ఫారం దేని కోసం పూర్తి చేయాలో ఇప్పుడు పూర్తిగా తెలుసుకుందాం. కాగా, ఏఫారాన్ని పూర్తి చేసిన అందులోని మార్పులు, చేర్పులకు తగిన ధ్రువపత్రాలను బీఎల్‌ఓలు లేదా తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాల్సి ఉంటుంది.

ఫారం–6 : ఓటరు జాబితాలో పేరు లేనివారు, కొత్త ఓటరుగా నమోదు అయ్యే 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు, ఓటును ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి మార్పు చేసుకునే వారు వినియోగించాలి.

ఫారం–6ఏ : భారత దేశం నుంచి ఉపాధి కోసం ఇతరదేశాలకు వెళ్లిన ఎన్‌ఆర్‌ఐలు ఓటు కావాలంటే ఫారం–6ఏను పూర్తి చేయాలి. ఇందుకోసం వారి స్వస్థలంలో తగిన ఆధారాలు ఉండాలి.

ఫారం–7: అభ్యంతరాలు, ఫిర్యాదుల కోసం ఫారం–7ను వినియోగించాలి. ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నా..చనిపోయిన వారిని తొలగించాలన్నా ఈ ఫారాన్ని వినియోగించాలి.

ఫారం–8 : ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అనువైన ఫారం ఇది. పేరు, ఫొటో, వయసు, ఎపిక్ నంబర్, అడ్రస్, జననం, రిలేషన్, టైప్ ఆఫ్ రిలేషన్, జండర్ తదితర మార్పులు చేసుకోవాలంటే వినియోగించాలి.

జలాధివాసానికి చేరువలో సంగమేశ్వర ఆలయం



సప్తనది సంగమ ప్రాంతంలో వెలసిన సంగమేశ్వరాలయ శిఖరానికి కృష్ణానది జలాలు చేరుకున్నాయి. ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్ట్ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో శ్రీశైల జలాశయం నీటిమట్టం 860 అడుగులకు చేరుకుంది. దీంతో రిజర్వాయర్ వెనుక జలాలు ప్రాచీన సంగమేశ్వరాలయం గోపుర శిఖరాన్ని తాకాయి. మరో 5 అడుగుల మేర నీటిమట్టం పెరిగితే సంగమేశ్వరాలయం పూర్తిస్థాయిలో జలాధివాసం కానుంది. – కొత్తపల్లి

9 నుంచి 'నా భూమి–నా దేశం'

- పంచాయతీల్లో స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలకు సన్నాహాలు
- స్థానిక సమరయోధులు, త్యాగధనుల శిలాఫలకాల ఏర్పాటుకు చర్యలు

నంద్యాల(సెంట్రల్): ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకతను కల్పించనున్నాయి. సంబరాలను పంచాయతీల స్థాయికి తీసుకెళ్లి ఆయా ప్రాంతాలకు చెందిన స్వాతంత్య్ర సమరయోధులు, రక్షణ రంగంలో అమరులైన ఆర్మీ అధికారులు, సిబ్బందికి గుర్తుగా శిలా ఫలకాలు ఏర్పాటు చేయనున్నారు. ఆయా మండలాల ఎంపీడీవోలు ఎంపిక చేసిన యువతతో తమ ప్రాంతాల్లో సేకరించిన మట్టిని కలశాలల్లో ఢిల్లీకి పంపనున్నారు. అంతేకాకుండా వసుధకు వందనం అనే కార్యక్రమం ద్వారా ప్రతీ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, చెరువులు, పాఠశాలలు తదితర చోట్ల 75 మొక్కల్ని నాటనున్నారు. కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 9వ తేదీన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సంతకాలతో కూడిన శిలాఫలకాల ఆవిష్కరణ, 10న 'వసుధకు వందనం' కార్యక్రమంలో భాగంగా 75 ఏళ్ల స్వాతంత్య్రానికి గుర్తుగా మొక్కలు నాటే కార్యక్రమం, 14న 'వీరులకు వందనం' పేరిట గ్రామ పంచాయతీల్లోని స్వాతంత్య్ర సమరయోధులు, దేశ రక్షణలో ఉన్న ఆర్మీ ఉద్యోగులను సత్కరించే విధంగా 'నా భూమి – నా దేశం' కార్యక్రమం ఉంటుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు రామచంద్రారెడ్డి తెలిపారు. 15వ తేదీన స్వాతంత్య్రదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి సమరయోధులకు నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు.

చంద్రబాబువి నీచ రాజకీయాలు

- ఎథిక్స్ కమిటీ చైర్మన్ శిల్పా చక్రపాణిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రజల్లో ఆదరణ కోల్పోయి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి విమర్శించారు. నల్లకాల్వ గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పుంగనూరులో శుక్రవారం జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు. ప్రజలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు చంద్రబాబు కుట్ర పన్నారని విమర్శించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇద్దరూ తరచూ సభల్లో అవాస్తలు చెప్పడం, ప్రజా ప్రతినిధులపై నిరాధారణ ఆరోపణలు చేయడం, ప్రజలను రెచ్చగొట్టడం చర్యలకు పాల్పడుతున్నారన్నారు. పుంగనూరు ఘటనలో చంద్రబాబు నాయుడును మొదటి నిందితుడిగా చేర్చి శిక్షించాలన్నారు. 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని చెప్పుకునే నాయకుడు ప్రజలను రెచ్చగొట్టడం శోచనీయమన్నారు. చివరకు వైఎస్సార్ సీపీకి అంటగట్టేలా చంద్రబాబు మాట్లాడడం సరికాదన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కురుకుంద శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సయ్యద్‌మీర్, సురేష్, ఎంపీపీ తిరుపాలమ్మ, ఎంపీటీసీ శాంతమ్మ, సర్పంచ్ వెంకటరమణ, శివశంకర్‌నాయక్, సురేష్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

బొమ్మలసత్రం: తన స్వలాభం కోసం ప్రజలను రెచ్చగొట్టి పోలీసు వ్యవస్థపై దాడులు చేయిస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని నంద్యాల ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వస్తేనే చంద్రబాబుకు ప్రజలు గుర్తుకు వస్తారని ఎద్దేవా చేశారు. ఓట్ల కోసం రైతులు, నీళ్ల ప్రాజెక్టులు అంటూ జనాల్లోకి వచ్చి రెచ్చగొట్టడమే చంద్రబాబు ధ్యేయంగా పెట్టుకున్నారని విమర్శించారు. శుక్రవారం రూట్ మ్యాప్‌కు విరుద్ధంగా అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గంలోకి వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారన్నారు. పోలీసులతో పాటు అక్కడి గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా అడ్డుకొని నిరసనలు వ్యక్తం చేశారన్నారు. ఈ క్రమంలో కార్యకర్తలను రెచ్చగొట్టి అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న రాళ్లు, కర్రలతో అక్కడి గ్రామస్తులు, పోలీసులపై విచక్షణా రహితంగా దాడి చేయించారన్నారు. ఎంతో సీనియర్ నాయకుడిని అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబునాయుడు అమాయక ప్రజలపై కార్యకర్తలతో దాడి చేయించడం హేయమైన చర్య అన్నారు. బాబు పద్ధతి మార్చుకోకుంటే ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కాల్వ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల్లో క్లస్టర్ వర్సిటీ పనులు పూర్తి

- ఏపీఈడబ్ల్యూఐడీసీ సీఈ గోపీచంద్

కర్నూలు(అర్బన్): నగర శివారులోని జగన్నాథగట్టుపై రూ.88.50 కోట్లతో చేపట్టిన క్లస్టర్ యూనివర్సిటీ పనులను రెండు నెలల్లోగా పూర్తి చేయాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ చీఫ్ ఇంజినీరు గోపీచంద్ సూచించారు. శనివారం సాయంత్రం ఆయన ఈఈలు శివశంకర్, అన్వర్‌బాషాతో కలిసి వర్సిటీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... చేపట్టిన పనుల్లో పూర్తి నాణ్యత ఉండాలన్నారు. నిర్మాణాలకు సంబంధించిన ఏవైనా ఇబ్బందులు ఉంటే, తమకు తెలియజేస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

'నులిపురుగుల నిర్మూలన'ను విజయవంతం చేద్దాం



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ తదితరులు

నంద్యాలటౌన్: నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న నిర్వహించే కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న 4,06,219 మందికి ఉచితంగా అల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్నామన్నారు. వైద్య, ఆరోగ్య, విద్య, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా, మండల స్థాయి అధికారులు సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ కో ఆర్డినేటర్ డాక్టర్ కాంతారావు నాయక్, ఇమ్యూనైజేషన్ అధికారి మల్లికార్జునరెడ్డి డాక్టర్ భరత్, డీపీఎం నజ్బీజ్, డీఎస్‌ఓ సూజాత పాల్గొన్నారు.

క్లుప్తంగా

గట్టెక్కి పారుతున్న ఎల్లెల్సీ నీరు



ప్యాలకుర్తి వద్ద ఎల్లెల్సీ కాల్వ గట్టు ఎక్కి పారుతున్న నీరు

కోడుమూరు రూరల్: తుంగభద్ర దిగువ కాలువకు నీరు ప్యాలకుర్తి గ్రామం వద్ద గట్టు ఎక్కి పారుతున్నాయి. దీంతో సుమారు 60 ఎకరాల్లో పంట పొలాలు నీటి మునిగాయి. కాల్వలో పూడిక తీయకుండా నీటిని వదలడంతో ఈ దుస్థితి తలెత్తిందని రైతులు మునీర్ బాషా, నారాయణ, బందెనవాజ్, సులేమాన్, షేక్షాలు వాపోయారు. నష్టపోయిన తమ పొలాలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు కోరారు.

నేడు దివ్యాంగులకు కొలతల స్వీకరణ

కర్నూలు కల్చరల్: భారత్ వికాస్ పరిషత్ తుంగ భద్ర శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాల పంపిణీకి సంబంధించి కొలతలు ఆదివారం స్వీకరిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి బైరెడ్డి చిరంజీవి రెడ్డి, బీవీపీ తిరుపతి ప్రాంత సేవా ప్రముఖ్ రేగూరు బాలకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బుధవారపేటలోని కేశవ మెమోరియల్ పాఠశాలలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కృత్రిమ అవయవాలకు దరఖాస్తు చేసుకున్నవారు హాజరుకావాలని తెలిపారు. మెడికల్ నిపుణులచే పరీక్షలు నిర్వహించి కొలతలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. దాతలు, కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 90000 88660, 81425 50143 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

స్నేహ బంధం.. సేవా సుగంధం

నేడు స్నేహితుల దినోత్సవం



చాలా మంది మిత్రులు సమయం దొరికితే సినిమాకు వెళ్లడమో.. షికారు కొట్టడమో..సరదాగా ఆటలు ఆడటమో చేస్తుంటారు. కొందరు కబుర్లు చెప్పుకుంటూ కాల క్షేపం చేస్తుంటారు. చాలా తక్కువ మంది మాత్రమే ఇతరుల గురించి ఆలోచిస్తుంటారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తుంటారు. స్వార్థం చూసుకోకుండా పరోపకారానికి ప్రాధాన్యత ఇస్తుంటారు. అనాథాశ్రమాలకు నిత్యావసరాలను అందించడం.. అభాగ్యులను ఆదుకోవడం.. ప్రమాదంలో గాయపడిన వారికి రక్తదానం చేయడం..పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం..ఇలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ స్నేహ బంధంలో వీరు సేవా సుగుంధాలను విరజిమ్ముతున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఇలాంటి స్నేహితులపై ప్రత్యేక కథనం.. – కర్నూలు కల్చరల్

ఆదర్శంగా నిలుస్తూ..



చిన్నారులతో సరదాగా ఉన్న వీరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరంతా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ పూర్తి చేశారు. చదువుకునే సమయంలో స్నేహితులయ్యారు. సమయం దొరికినప్పుడల్లా కలుస్తుంటారు. సేవా కార్యక్రమాలు మాత్రం క్రమం తప్పకుండా చేస్తుంటారు. ఆశ్రమాలకు వెళ్లి అనాథ, వృద్ధులకు సపర్యలు చేయడంతోపాటు ఆహార పదార్థాలు అందజేస్తున్నారు. రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సేవ..స్నేహం..వీటిని వదులుకోబోమని భువన, శృతి, శ్రీకాంత్, చిన్ను, జీవన, వేణు, అహ్మద్, హర్ష చెబుతున్నారు.

ఆపన్న హస్తం అందిస్తూ..



వీరంతా చిన్ననాటి స్నేహితులు. ఆదోని వైఎంకే పాఠశాలలో 1997–98 సంవత్సరంలో చదువుకున్నారు. ఒక బృందంగా ఏర్పడి తోటి మిత్రులకు ఏ ఆపద వచ్చినా అండగా నిలుస్తున్నారు. కరోనా సమయంలో మిత్రులు రమేష్, మల్లికార్జున మృతి చెందగా వారి కుటుంబాలకు రూ.50,000, రూ.1,00,000 అందించారు. ఇటీవల రామలింగ కిడ్నీ సమస్యలతో బాధపడుతూ ఉండగా గమనించి, కిడ్నీ మార్పిడి చేసుకోవడానికి రూ. 2,00,000 అందించారు. ఆపదలో ఉన్న మిత్రులను ఆదుకోవడం కన్నా గొప్పతనం ఇంకేముంటుందని రమణ, మహేందర్‌రెడ్డి, బద్రినాథ్, నరేంద్రకుమార్, కిరణకుమార్ తెలిపారు. – ఆదోని సెంట్రల్

సామాజిక బాధ్యతగా..



ఈ చిత్రంలోని ఉన్న స్నేహితులు హర్ష, దివ్య, చంద్రజ, విజయశ్రీ, మహాలక్ష్మి, శ్రావణి, సేహ, లిఖితా రెడ్డి. వీరు చదువుకుంటూ సామాజిక బాధ్యతగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. రక్తదాన శిబిరం నిర్వహించడంతో ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూపింగ్ లిస్ట్ పెట్టుకొని ఆపద వేళల్లో అవసరం ఉన్నవారికి రక్తం ఇస్తున్నారు. జాతీయ పర్వదినాలు, పుట్టిన రోజు వేడుకల్లో అనాథ, వృద్ధాశ్రమాలకు వెళ్లి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పల్లెలకు వెళ్లి ప్రజలకు పలు సామాజిక రుగ్మతపై అవగాహన కల్పిస్తున్నారు.

సమాజ హితమే లక్ష్యంగా..



చదువే కాదు సామాజిక సేవ కూడా ముఖ్యమని నమ్మి వీరంతా మిత్రులయ్యారు. కర్నూలు నగరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ బ్రాంచ్‌ల్లో బీటెక్ చదువుతున్న వీరు స్నేహితులుగా ఉంటూ ఎవరైనా ఇబ్బందులు, సమస్యల్లో ఉంటే వారికి అండగా నిలుస్తున్నారు. శీతాకాలంలో పేదలకు దుస్తులు, స్వెటర్లు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. శ్రీశైలానికి పాదయాత్ర చేసే భక్తులకు ప్రథమ చికిత్స చేయించడం, మందులు పంపిణీ చేయడం చేస్తున్నారు. కళాశాలలో రక్తదాన శిబిరాలు చేపడుతున్నారు. మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తూ పర్యావరణ హితాన్ని గుర్తు చేస్తున్నారు. సేవా సంకల్పం ప్రతి ఒక్కరికీ అవసరమని, అదే సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని సాయి చరణ్, భార్గవ్, మనీష్ చంద్ర, శరత్, గోపాల్, విజయ్, వరుణ్, సుభాష్, యశ్వంత్, నవీన్, హరికృష్ణ, రామకృష్ణ చెబుతున్నారు.

మద్దెమాను మడుగు ప్రాజెక్టులో జిల్లా యువకుడి గల్లంతు



సురేంద్రరెడ్డి (ఫైల్)

వెదురుకుప్పం: చిత్తూరు జిల్లా మారేపల్లె సమీపంలో ఉన్న మద్దెమాను మడుగు ప్రాజెక్టులో శనివారం నంద్యాల జిల్లా బనగానపల్లెకు చెందిన కే. సురేంద్రనాథ్‌రెడ్డి(22) గల్లంతయ్యాడు. జైపూర్‌లోని జగన్నాథ యూనివర్సిటీలో అగ్రికల్చరల్ బీఎస్సీ మూడు సంవత్సరాల కోర్సు చేసిన సురేంద్ర నాలుగో సంవత్సరం ప్రాజెక్టు పనుల కోసం రేణిగుంట కృషి విజ్ఞాన కేంద్రాగానికి ఇటీవల వచ్చాడు. ఈ క్రమంలో 30 మంది విద్యార్థులు ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు గత మూడు రోజులుగా వెదురుకుప్పం వచ్చారు. శనివారం వెదురుకుప్పం ఆర్బీకేలో ప్రాజెక్టు పనులు ముగించుకుని సాయంత్రం 3 గంటల సమయంలో 15 మంది స్నేహితులతో కలిసి సరదాగా సమీపంలోని మద్దెమాను మడుగు ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. ప్రాజెక్టులో ఈత కొడుతూ కొందరు అవతలి ఒడ్డుకు చేరుకున్నారు. సురేంద్ర రెడ్డి ప్రాజెక్టు మధ్యలోకి వెళ్లగానే ఆయాసం ఎక్కువ కావడంతో ఈత కొట్టలేక నీట మునిగిపోయాడు. స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. జరిగిన సంఘటనను సురేంద్రరెడ్డి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. సమాచారం అందుకున్న పుత్తూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

ఫ్రూట్‌మార్కెట్‌లో భారీ అగ్నిప్రమాదం



ఫ్రూట్‌మార్కెట్‌లో భారీగా చెలరేగిన మంటలు



బాధితులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

- రూ. 50 లక్షల మేర ఆస్తినష్టం

బొమ్మలసత్రం: నంద్యాల ఫ్రూట్‌మార్కెట్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పండ్లతో పాటు రెండు కార్లు, ఒక ఆటో, మూడు తోపుడు బండ్లు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక అధికారి యోగేశ్వరరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. స్థానిక గాంధీచౌక్ సమీపంలో కూరగాయల మార్కెట్ పక్కనే ఉన్న ఫ్రూట్ మార్కెట్‌లో ఎంతో మంది వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన పండ్లను ఇక్కడ రిటైల్ వ్యాపారులకు విక్రయాలు జరుపుతుంటారు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో మార్కెట్‌లోని ఓ రేకులషెడ్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. పండ్ల బుట్టల్లో వచ్చే వరిగడ్డిపై నిప్పులు పడి ఒక్కసారిగా భారీగా మంటలు వ్యాపించాయి. అక్కడే ఉన్న వ్యాపారులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేక పోయింది. పక్కనే ఉన్న రెండు కార్లు, ఆటో, మూడు తోపుడు బండ్లకు మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించటంతో హుటాహుటిన సిబ్బంది చేరుకుని గంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో అక్కడ నిల్వ ఉంచిన పండ్లు పూర్తిగా మంటల్లో దగ్ధమయ్యాయి. దాదాపుగా రూ. 50 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించి ఉండవచ్చని ఫైర్ అధికారులు అంచనా వేస్తున్నారు.


బాధితులకు అండగా ఉంటాం...

అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను ఎమ్మెల్యే బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ఫ్రూట్‌మార్కెట్‌లో అగ్రిప్రమాదం జరగటం బాధాకరమన్నారు. ఎంతో మంది పేదలు, చిరువ్యాపారులు మార్కెట్‌ను ఆసరాగా చేసుకుని జీవిస్తున్నారన్నారు. బాధితులకు అండగా నిలిచి ఆదుకుంటామన్నారు.

ఆసుపత్రిలో ముగ్గురు నవ జాత శిశువుల మృతి

నంద్యాలటౌన్: పట్టణంలోని సర్వజన ఆసుపత్రిలో వివిధ కారణాలతో ముగ్గురు నవజాత శిశువులు శనివారం మృతి చెందారు. బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో మూడు రోజుల క్రితం శ్రావణి అనే మహిళ ఇద్దరు కవలలకు జన్మనిచ్చింది. వారిలో ఒక శిశువు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాల ఆసుపత్రికి శుక్రవారం తరలించారు. సాధారణ బరువు కన్నా చాలా తక్కువగా ఉండడంతో కోలుకోలేక శనివారం మృతి చెందాడు. అదే విధంగా నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు నవజాత శిశువులను వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం చేర్చారు. వారిలో ఒకరు గుండెకు సంబంధించిన వ్యాధితో మృతి చెందగా, మరో నవజాత శిశువు అనారోగ్యం కారణంగా మృతి చెందినట్లు ఆసుపత్రి సూరింటెండెంట్ వరప్రసాదరావు తెలిపారు.

అప్పులబాధతో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ బలవన్మరణం



మృతి చెందిన శ్రీనివాసులు

బనగానపల్లె: పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ అప్పులబాధతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్‌ఐ రామిరెడ్డి వివరాల మేరకు.. విజయవాడ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు నెల రోజుల క్రితం బనగానపల్లెశాఖకు బదిలీ అయ్యారు. కాగా భార్య అనిత, కుమారుడు కర్నూలు నివాసం ఉంటున్నదున కర్నూలు బ్రాంచ్‌కు బదిలీ చేయాలని ఉన్నతాధికారులకు విన్నవించినా బదిలీ చేయలేదు. ఇక్కడ పని చేయడం ఇష్టం లేకపోవడంతో పాటు వ్యక్తిగతంగా అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెందాడు. స్థానిక పెండేకంటి నగర్ కాలనీలో నివాసం ఉంటన్న గదిలో శుక్రవారం అర్ధరాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అత్మహత్యకు పాల్పడే ముందు 'ఉద్యోగం చేస్తున్నా.. కుటుంబానికి న్యాయం చేయలేకపోయా.. నన్ను క్షేమించు' అంటూ శ్రీనివాసులు తన భార్య అనితకు నోట్ రాసి పెట్టాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'నెట్'లో మెరిసిన పేదింటి విద్యార్థి

- జాతీయ స్థాయిలో 78వ ర్యాంకు



వెంకటకృష్ణ

ఓర్వకల్లు: సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌లో ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన పీఎస్‌వి కృష్ణ ప్రతిభ కనబరిచాడు. ఈ ఏడాది జూన్‌లో ప్రవేశ పరీక్ష రాయగా ఈనెల 2వ తేదీన ఫలితాలు వెలువడ్డాయి. జాతీయ స్థాయిలో 78వ ర్యాంకు సాధించాడు. వివరాలు ఆయన మాటల్లోనే.. '' మా తల్లితండ్రులు కృష్ణవేణి, రామకృష్ణ దంపతులు. వ్యవసాయ కూలీ పనులు చేసేవారు. నాకు పుస్తకాలు కొనేందుకు కూడా ఆర్థిక స్తోమత లేదు. ఇతరుల పుస్తకాలు తీసుకుని చదువుకునేవాణ్ని. కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివాను. కర్నూలులో ఇంటర్, తిరుపతి ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ బీఎస్సీ పూర్తి చేశాను. ఆ తర్వాత రాంచిలోని జార్ఖండ్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేశాను. శాస్త్రవేత్తను కావాలనే ఆశయంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్లో పనిచేస్తూ సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌కు సిద్ధమయ్యాను. జాతీయ స్థాయిలో 78 ర్యాంక్ వచ్చింది. ఈ పరీక్షలో దేశవ్యాప్తంగా 50 వేల మంది పాల్గొనగా, అందులో మన రాష్ట్రం నుంచి అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 20 మందిలో నేను ఒకడిగా ఉన్నాను. చిన్నప్పుడు గురువుల మాటలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లుతున్నాను. మా కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఉన్నత చదువులు చదవాలంటే డబ్బుతో కూడిన వ్యవహారమనే ఆలోచన నన్ను వేధిస్తోంది. ఎవరైనా దాతలు సహకరిస్తే శాస్త్రవేత్తగా దేశానికి సేవలు అందిస్తాను''

ఐలూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

కర్నూలు(లీగల్): నగరంలో శనివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) 4వ జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఐలు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సింగరాజు లక్ష్మన్న, కెంగార కుమార్‌ను ఎన్నుకున్నారు. అలాగే 12 మందిని కార్యవర్గ సభ్యులను, 18 మందిని జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకనున్నారు.

నేర పరిశోధనలో ఫోరెన్సిక్ పాత్ర కీలకం

కర్నూలు(హాస్పిటల్): నేర పరిశోధనలో ఫోరెన్సిక్ విభాగం పాత్ర చాలా కీలకమని, ఎన్నో నేరాలకు ఫోరెన్సిక్ వారు ఇచ్చిన నివేదికల కారణంగా ఆధారాలు లభ్యమయ్యాయని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో శనివారం ఫోరెన్సిక్ విభాగం ఆధ్వర్యంలో జోనల్ సీఎంఈ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలుతో పాటు అనంతపురం, నంద్యాల, వైఎస్ఆర్, నెల్లూరు, విజయవాడ ఉమ్మడి జిల్లాల నుంచి వైద్యులు, పీజీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. సుధాకర్ మాట్లాడుతూ.. కళాశాలలోని ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం వైద్యవిద్యతో పాటు విశేషమైన సేవలు అందిస్తోందన్నారు. ప్రతిరోజూ ఈ విభాగంలోని మార్చురిలో 6 నుంచి 8 పోస్టుమార్టమ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీజీ సీట్లు, వైద్యులు పెరిగిన నేపథ్యంలో మరింత బాగా పనిచేసి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం మెడికల్ లీగల్ ఇన్వెస్టిగేషన్ ఇన్ డాక్టర్ రోల్ అనే అంశంపై ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం వివరించారు.